క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండల పరిధిలోని కాగానిపల్లి, చిన్నరప్పల్లి , గొల్లపల్లి, బూదిలి తండా గ్రామాల్లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 9:30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు ఓ ప్రకటనలో తెలిపారు.

గడ్డివామికి నిప్పు



చిలమత్తూరు: మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ పెద్దనపల్లిలో రైతు ఆదినారాయణరెడ్డికి చెందిన రెండు గడ్డివాములకు మంగళవారం అర్ధరాత్రి దుండగులు నిప్పు పెట్టారు. దీంతో రూ.60 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

ప్రణాళికతో చదవండి

పెనుకొండ: ప్రతి విద్యార్థి భవిష్యత్ ప్రణాళికతో చదవాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఉన్న పరిటాల శ్రీరాములు కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కుళాయిల ఏర్పాటు



కుళాయిలను ప్రారంభిస్తున్న చైర్మన్ ఉమర్‌ఫరూక్‌ఖాన్

పెనుకొండ: పట్టణంలో బాబయ్య స్వామి గంధం, ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆదేశాల మేరకు నగర పంచాయతీ అధికారులు భక్తులకు ఉచిత మంచి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. దర్గాకు సమీపంలోని వాటర్ ప్లాంట్‌లో కొళాయిలను ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యార్థం ఉంచారు. నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ బుధవారం సాయంత్రం దాన్ని ప్రారంభించారు. భక్తులు ఉచిత నీటిని సద్వినియోగం చేసుకోవాలనికోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, కౌన్సిలర్ భాస్కర్‌నాయక్, రఘునాథరెడ్డి, శేషాద్రి, సద్దాం, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, యాసిన్, ఫరీద్, కోఆప్షన్ మెంబర్ నేమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

20న ఫిర్యాదుల స్వీకరణ

హిందూపురం టౌన్: తపాల సేవలకు సంబంధించి ఈ నెల 20న స్థానిక తపాల సూపరింటెండెంట్ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ బాల సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు తమ ఫిర్యాదులను 'సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్, హిందూపురం–515201' కార్యాలయానికి ఈ నెల 15లోపు పోస్ట్ కవర్‌పై డాక్ అదాలత్ అని పెద్ద అక్షరాలతో రాసి పంపాలన్నారు. ఫిర్యాదులను పరిశీలించి అర్జీ పరిష్కారాన్ని లెటర్ ద్వారా తెలియజేస్తామన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుడిబండ: మండల పరిధిలోని మందలపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని మందలపల్లి హెచ్‌ఎం విశ్వనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు నరసింహప్ప, ప్రధాన కార్యదర్శి శివానాయక్, జిల్లా యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు భూతన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా కార్యదర్శిగా భాగ్యలక్ష్మి

హిందూపురం టౌన్: బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన భాగ్యలక్ష్మిని నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం భాగ్యలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో బాధ్యతలు కల్పించడం సంతోషంగా ఉందని, పార్టీ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

జగనన్నకే మా మద్దతు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు మంజమ్మ. వీరిది మడకశిర పరిధిలోని కంబాలపల్లి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ రైతు భరోసా రూ.40,500, పంటల బీమా రూ.1,292 , సున్నా వడ్డీ రూ. 3,265 , వైఎస్సార్ ఆసరా రూ. 18,498, సున్నా వడ్డీ (డ్వాక్రా) రూ. 4,222 , అమ్మవడి రూ.43 వేలు, పింఛన్ కానుక రూ.82 వేల చొప్పున ప్రభుత్వ పథకాల ద్వారా రూ. 1,92,777 లక్షలు లబ్ధి పొందారు. తమ కుటుంబానికి ఎంతో భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్‌ను ఎప్పటికీ మరువలేమని మంజమ్మ హర్షం వ్యక్తం చేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు రత్నమ్మ. వీరిది మడకశిర పరిధిలోని కంబాలపల్లి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న విద్యా దీవెన ద్వారా రూ.57 వేలు, జగనన్న వసతి దీవెన ద్వారా రూ.884, సున్నా వడ్డీ రూ.651, రైతు భరోసా రూ.24,500 , పంటల బీమా కింద రూ.890, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.37,500 , అమ్మఒడి ద్వారా రూ.29 వేలు, ఆసరా రూ.10,182 చొప్పున మొత్తం రూ.1,60,607 లబ్ధి పొందారు. సీఎం వైఎస్ జగనన్న మేలును ఎప్పటికి మరిచి పోలేమని, మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని రత్నమ్మ అన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రామన్న. వీరిది రొద్దం మండలం బూదిపల్లి. ఈయన టీడీపీ మద్దతుదారుడు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోని వచ్చాక ఈ కుటుంబం రూ 3.9 లక్షలు లబ్ధి పొందింది. వైఎస్సార్ ఆరోగ్య శ్రీద్వారా రూ 2,10,785, ఆసరా రూ 17,012, వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ. 82 వేలు లబ్ధి పొందారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నారంటూ సీఎం జగన్‌ను రామన్న కొనియాడారు. ముఖ్యమంత్రి జగనన్న మేలు ఎప్పటికీ మరచిపోమన్నారు.

- సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారుల హర్షం
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో పాల్గొన్న ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి



సంక్షేమ పథకాలను వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



రొద్దం: సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

మడకశిరరూరల్: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గడపకూ సంతృప్తికర స్థాయిలో సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. అర్హులందరికీ పక్కాగా బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు పడుతున్నాయి. అన్ని విధాలా అండగా ఉన్న ముఖ్యమంత్రి జగనన్నకే మా మద్దతు' అంటూ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కదిరేపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని కొడిగానిపల్లి, కంబాలపల్లి, ఉగ్రేపల్లి గ్రామాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికీ మంజూరైన పథకాలతో కూడిన బుక్‌లెట్‌ను అందించారు. సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. తమ ఇంటిలో మూడు, నాలుగు పథకాలు లబ్ధిపొందామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. నవరత్నాలు తమకు ఎంతో సంతృప్తిని ఇచ్చాయన్నారు. అనంతరం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలను ఎమ్మెల్యే తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సక్రమంగా పౌష్టిహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి నాణ్యతతో కూడిన భోజనం విద్యార్థులకు వడ్డించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకుంటేనే పథకాలు అన్నీ సక్రమంగా అందుతాయని వివరించారు. ప్రజలు, రైతులకు ఎలాంటి సమస్య వచ్చిన మండల కేంద్రానికి రాకుండా గ్రామ సచివాలయం, ఆర్బీకే కేంద్రాల్లో పరిష్కారించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, సర్పంచ్ నర్సేగౌడు, ఎంపీటీసీ నరసింహమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, నాయకులు కెంచప్ప, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మూర్తి, రమేష్, భాస్కర్‌రెడ్డి, నారాయణప్ప,గోవిందప్ప, జంపన్న, హనుమంతరాప్ప, కార్యదర్శి పర్సేగౌడు, ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలతో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని కలిపి గ్రామ పంచాయతీ ఎస్సీ, బీసీ కాలనీలు, బూదిపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల సమస్యలపై ఆరాతీశారు. కాలనీ వాసులు గ్రామానికి రోడ్డు సౌకర్యం, డ్రైనేజీలు, ఇళ్లు తదితర సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ రోడ్డు పనులు ప్రారంభించామని, త్వరలోనే గ్రామానికి రోడ్డు పూర్తి చేస్తామన్నారు. ఇంటి స్థలం లేని ప్రతి నిరుపేదకు ఇంటి స్థలం మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు దక్కుతుందన్నారు. మాజీ సీఎం చంద్రబాబు ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి రావడానికి కుయుక్తులు పన్నుతున్నారన్నారు. ప్రజలు ఆయన మాటలు నమ్మే పరిస్థితిలో లేదన్నారు.

పనులకు భూమి పూజ..

మండలంలోని కలిపి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు కింద గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరనారాయణ భూమి పూజ చేశారు. రూ. 19 లక్షల నాడు–నేడు కింద మంజూరైనట్లు పాఠశాల హెచ్‌ఎం నాగేష్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ కదిరమ్మ, ఎంపీటీసీ వనజ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, కలిపి సింగిల్ విండో చైర్మన్ కేపీ శ్రీనివాసులు, తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, మాజీ సింగిల్ విండో చైర్మన్లు మారుతిరెడ్డి, రాజారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కలిపి శ్రీనివాసులు, వజీర్, రాజ్‌గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కస్సప్ప, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: తాలూకాలోని రంగసముద్రం, దొడ్డేనహళ్లి, వదనకల్, గోవర్ధనగిరి, మల్లమ్మనహళ్లి, సాసలుకుంటె, కెంచమ్మనహళ్లి గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెంకటరమణప్ప బుధవారం భూమి పూజలు నిర్వహించారు. మల్లమ్మనహళ్లి గ్రామంలో రూ 13.90 లక్షలతో నిర్మించే నూతన ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే రూ.1.5 కోట్లతో సాసలకుంటె-లింగదహళ్లి రోడ్డు పనులు, సాసలకుంటె, గొల్లరహట్టి గ్రామాలలో రూ. చెరో 13.90 లక్షలతో నిర్మించే నూతన ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. అనంతరం కెంచమ్మనహళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఏ గ్రామానికి వెళ్లినా తాము చేసిన అభివృద్ధి పనులు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయన్నారు. అధికారం శాశ్వతం కాదని, అభివృద్ధే శాశ్వతమని తెలిపారు. బీజేపీ, జేడీఎస్ దొందూ దొందేనని ఎద్దేవా చేశారు. వారి ప్రభుత్వాలలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రాభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

మడకశిర: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 1 గంటకు నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే తిప్పేస్వామి పంపిణీ చేస్తారని ఎంపీడీఓ సోనిబాయి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు నూతన పింఛన్ లబ్ధిదారులు పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా చూడాలని కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంటారని ఆరోగ్య కార్యకర్త మంజుల తెలిపారు. బుధవారం నిద్రగట్ట అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక పోషణ వేడుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. పాలు, గుడ్లు, పండ్లు తదితర వాటిని నిత్యం ఆహారంగా తీసుకోవాలన్నారు. అలాగే అంగన్‌వాడీలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పూలేని ఆదర్శంగా తీసుకోవాలి

మడకశిర: మడకశిరలోని ఎమ్మెల్యే తిప్పేస్వామి స్వగృహంలో బుధవారం దళిత హక్కుల పరిరక్షణ సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే తిప్పేస్వామి ... పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, ఆమిదాలగొంది సర్పంచు గీత, ఉపాధ్యాయురాలు లక్ష్మీకాంతమ్మ తదితరులను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు చదువు అవసరమని చాటి చెప్పిన మహిళ అని పేర్కొన్నారు. మహిళలు సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు, మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కౌన్సిలర్ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ మూర్తుల ఊరేగింపు



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వరస్వామి సముదాయ దేవాలయాల్లోని రంగనాథస్వామి, వేణుగోపాలస్వామి, సత్యనారాయణస్వామి ఉత్సవ మూర్తులను బుధవారం ఊరేగించారు. అనంతరం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బస్సు ప్రమాదంలో కాపాడిన వారికి సన్మానం: నీలకంఠాపురం గ్రామం వద్ద గత నెల 21న ఓ ప్రైవేట్ బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ఆ సమయంలో చిక్కుకున్న వారిని నిచ్చెన సాయంతో కాపాడిన గ్రామ ప్రజలను మాజీ మంత్రి రఘువీరారెడ్డి బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో కేటీ శ్రీధర్, అంభిక లక్ష్మీనారాయణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

అమరాపురం: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అమరాపురం గ్రామ సచివాలయం సిబ్బంది వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలన్నారు. అర్హులకు అన్యాయం జరిగితే మాత్రం చూస్తూ ఊరుకోమన్నారు.సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అందిస్తున్న సేవలను అందించాలన్నారు. కొంతమంది అధికారులు, వలంటీర్లు సక్రమంగా పని చేయడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారు పద్ధతి మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీ క్రిష్ణమూర్తి, జెడ్పీటీసీ స్వారక్క, సింగిల్ విండో అధ్యక్షుడు చిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేపై సమీక్ష

సోమందేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంపై డీఎల్‌పీఓ బాలాజీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజు రావు, గ్రామ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రొళ్ల: ఆంధ్రప్రగతి గ్రామీణా బ్యాంక్ ద్వారా డిపాజిట్లపై 7.8 శాతం వడ్డీని చెల్లిస్తామని ఆశాఖ మేనేజర్ నాగరమణ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బీజీ హళ్లిలో ఏపీజీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ నాగరమణ పలు సూచనలు, సలహాలిచ్చారు.

ముగిసిన అన్నదాన కార్యక్రమం

హిందూపురం: పట్టణంలోని బెంగళూరు రోడ్డు అయ్యప్పస్వామి ఆలయంలోని అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో 46 రోజుల పాటు అయ్యప్ప మాలధారులు, భక్తులకు చేపటిన అన్నదానం కార్యక్రమం బుధవారంతో ముగిసినట్లు కమిటీ అధ్యక్షుడు రమేష్‌కుమార్ పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి దాతలు అందించిన సహకారం మరువలేనిదన్నారు.

చెప్పాడంటే చేస్తాడంతే !



రొద్దం: సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులతో కలసి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



హిందూపురం: నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



అమరాపురం: టీడీపీ నాయకుడు మంజునాథకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- మాట తప్పకుండా పింఛన్లను పెంచి చూపించారు
- సీఎం జగన్‌ను కొనియాడిన ప్రజాప్రతినిధులు

రొద్దం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏదైనా హామీ ఇచ్చాడంటే చేసితీరతారని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నూతన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 263 కొత్త పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. అవ్వతాతలకు ఎన్నికల ముందు పాదయాత్రలో హామీ ప్రకారంలో పింఛన్లను పెంచుతూ పోతున్నారన్నారు. ఇచ్చిన మాట తప్పని నాయకుడు జగనన్న అన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రం మొత్తం 39 లక్షలు పింఛన్లు ఇస్తే జగనన్న ప్రభుత్వం వచ్చాక 62 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నట్లు వివరించారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు పెట్టి పచ్చకండువాలు వేసుకున్న వారికే పింఛన్లు ఇచ్చేవారన్నారు. అనంతరం లబ్ధిదారులతో కలసి సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సుధాకర్‌రెడ్డి, అల్లాబకాష్, నరేంద్ర, కమలాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాల ప్రదాత అని ఎమ్మెల్యే తిప్పేస్వామి కొనియాడారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పింఛన్లను పంపిణీ చేశారు. తిప్పేస్వామి మాట్లాడుతూ సీఎం.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రతి ఏడాది రూ.250 పింఛన్ పెంచుతూ పోతామని ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం రూ.2750 పింఛన్‌ను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో కొత్తగా 282 మందికి పింఛన్ మంజూరైందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న మాట ఇస్తే చేస్తాడంతే అని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పే మోసపూరిత మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని, ఆయన అధికారంలోకి వస్తే పథకాలు ఒక్కటీ ఉండవన్నారు. బాబు పచ్చి మోసగాడని, సొంత మామకే వెన్నుపోటు పొడచిన వ్యక్తని విమర్శించారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీలు లలితమ్మ, క్రిష్ణమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు చిక్కన్న, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్లు లక్ష్మీదేవి, గగన, వీరక్యాతరాయప్ప,ఎంపీడీఓ మునిస్వామి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులు పాల్గొన్నారు.

హిందూపురం/లేపాక్షి: పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ కుల,మత, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా పింఛన్‌తో పాటు ప్రతి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. హిందూపురం మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక ఆర్‌కే ఫంక్షన్‌హాల్‌లో ఎంపీడీఓ నరేంద్ర అధ్యక్షతన జరిగింది. అలాగే లేపాక్షిలో వెలుగు కార్యాలయంలోనూ పింఛన్ల పంపిణీ జరిగింది. ఎమ్మెల్సీతో పాటు మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ టీడీపీ పాలనలో 39 లక్షల పింఛన్లు అందిస్తే వైఎస్సార్‌సీపీ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 64 లక్షల పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం జగన్ ఇంటి పెద్ద కొడుకులా పుట్టిన బిడ్డ సంక్షేమం మొదలు వృద్ధాప్య పింఛన్ వరకు అందరికీ అండగా ఉంటున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమా షూటింగ్‌లలో ఉండి అసెంబ్లీ వెళ్లాలని కూడా మరచిపోయారని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ హిందూపురంలో 40 ఏళ్లగా టీడీపీని గెలిపిస్తున్నా తేడా చూపకుండా అన్ని నియోజకవర్గాలు మాదిరిగానే ఇక్కడా అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం జగన్ నిధులు అందిస్తున్నారన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఇలాంటి సీఎం మరో వందేళ్ల పాలన సాగించాలంటే మీ ఆశీర్వాదాలు, అండదండలు అవసరమన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 90 శాతానికి పైగా పూర్తి చేశారన్నారు. ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఏకైక సీఎం జగనేనన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రఘునాథరెడ్డి, రామాంజినప్ప, జెడ్పీటీసీ నాగభూషణం, సర్పంచులు భాగమ్మ, శ్రీనివాసరెడ్డి, దేవరాజు, ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కవిత, లేపాక్షిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలే అంజినరెడ్డి, నీలావతి, సర్పంచులు అశ్వర్థనారాయణ, మంజునాథ్, వసుంధర, ఎంపీటీసీ సభ్యులు ఆదినారాయణ, కోఆప్షన్ సభ్యులు బషీర్ తదితరులు పాల్గొన్నారు.

అడదాకులపల్లిలో...

పెనుకొండ రూరల్: పెనుకొండ మండలంలోని అడదాకులపల్లి గ్రామంలో కొత్తగా మంజూరైన 11 పింఛన్లను బుధవారం సర్పంచు అలివేలమ్మ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, శ్యామ్‌నాయక్, నంజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: సర్‌లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జిల్లాస్థాయి ఆటపోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, సంక్షేమశాఖ చైర్మన్ ముంతాజ్ పటాన్, దివ్య చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు వేణుగోపాల్ సర్టిఫికెట్లు, బహుమతు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ దివ్యాంగులంతా లూయి బ్రెయిలీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉమ్మడిజిల్లా వికలాంగుల సంఘ అధ్యక్షుడు రమణ, విభిన్న ప్రతిభావంతులు నాగరాజు, కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని ప్రతిభ వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటం వద్ద అంధులు కేక్‌కట్ చేశారు. లూయి జీవిత చరిత్రను వివరించారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో ప్రతిభ వికలాంగుల సొసైటీ సభ్యులు వరలక్ష్మి, సుబ్బరాయుడు, సీఈఓ నరసింహులు, రొద్దం, రామగిరి, చెన్నేకొత్తపల్లి తదితర మండలాల నుంచి పెద్ద ఎత్తున వికాలుంగాలు పాల్గొన్నారు.